ఆ కాగితాన్ని తిరిగి ఆయనకే ఇచ్చేశాను. చూస్తూ వుండగానే ఆ కాగితం అణువుకన్నా చిన్న చిన్న ముక్కలుగా చిరిగిపోయింది.

ఇహ అక్కడ నేను ఒక్క క్షణం కూడా నిలవలేదు బయలుదేరి సరాసరి మా వూరు వచ్చేశాను.

ఇంటికి రాగానే అంతా కలసి ఒక్కసారిగా అడిగారు.

ఎల్లా వుంది!

నేను వెళ్ళేసరికే అంతా అయిపోయింది.

పాపం!! అని అంతా నన్ను ఓదార్చారు.

ఆ అమ్మాయి ఎవరు అని ఇంకొక ప్రశ్న వచ్చింది.

పది సంవత్సరాల క్రితం నా దగ్గర టైపిస్టుగా వున్న పిల్ల.

"అల్లాగా" అని అంతా ఇంకొకసారి జాలిపడ్డారు.

ఆ రోజు రాత్రి మేమిద్దరం ఒటరిగా వున్నప్పుడు మా ఆవిడ.

"మీ టైపిస్టు పేరు కమల నాకు బాగా జ్ఞాపకం. ఈ శ్యామల ఎవరండి?" అని అడిగింది.

"రెండు సంవత్సరాల క్రితం నేను ఢిల్లీనుంచి వస్తుంటే నాకు బాగా జ్వరం వచ్చింది. దాదాపుగా స్పృహ లేకుండానే ప్రయాణం చేశాను. బెజవాడలో దిగి చూసుకుంటే నా పర్సు, నాడైరీ కనిపించలేదు. రైలు టికెట్టు మాత్రం నా చొక్కా జేబులో కనిపించింది. ఆ దొంగ ఎవరో తెలిసింది" అని అన్నాను.

మా ఆవిడ నా వంకచూచి " ఆడైరి, ఆ పర్సు... "అని ఆపేసింది.

నేను "అవును" అని అన్నాను.

తను నా చేతిని తన చేతిలోకి తీసుకుని "అదంతా మరచిపోండి... చచ్చిపోయిన వారిని గురించి చెడ్డగా తలచకూడదు" అని అంది.

# చివురంటి చిన్నది

నీటైన చిన్నవాడా
నిన్నె నమ్ముకుంటినోయి
చివురంటి చిన్నదాన్నోయి దొరా!
చావున్న చిలకనోయి దొరా! !

అంటూ కలలో కలువరిస్తోంది ఒక అలికులవేణి తూరుపు తెలతెలవారకుండానే, కల కలమని పక్షిగణం చెదరకమునుపే రాత్రి అంతా ముచ్చటలతో, మైమరపించిన తియ్యటి కలలో ఆదమరచిన చిన్నదానిని నిదుర మేల్కొల్పటం ఎంతటి చిక్కు ప్రశ్న ! ! ఎటువంటి గడ్డుసమస్య !! కలలతో మేల్కొని, మెలుకువలో నిదురపోయేవారిని సుషుప్తినుంచి జాగృతికి తీసుకురావడం ఆ లీలామానుష విగ్రహానికే సాధ్యం కాదే !! తలచెడి వయస్సు వుడిగి, పడుచుదనం పరుగుని మరిచిపోయిన ఆండాళ్ళమ్మకేం అర్థమవుతుంది.

ఆవిడకి అర్థమైందల్లా "మా కాలంలో యిటువంటివి ఎరగవమ్మా !!

తెలవారేసరికి యింకా నిద్దురపోతున్న భార్యని చూస్తే, భర్తకు మహాపాతకంట. అంటే అలా ఆదమరిచి నిదురపోతూ, నిన్నరాత్రి ముచ్చటలు మురిపాల చిహ్నాలు యింకా రూపుమాయకముందే ఆయన కంటపడితే

సంధ్యా వందనం మాట ఎలావున్నా, మళ్ళీ ద్వైతం అద్వైతం అవుతుందేమోనని పెద్దలు భయపడి యీ హెచ్చరిక చేశారుట. అటువంటి హెచ్చరికలే లేకపోతే, ప్రపంచములోకి వచ్చే నూతన మానవకోటిలో బ్రతికి బట్టకట్టడం మాట ఎలా వున్నా, యీ గడ్డమీద నిలబడటానికే ఏనాడో మనకు స్థలం చాలేది కాదు !!

అందుకనే ఆయనింటి యిల్లాలు తొలికోడికంటే ముందుగాలేచి ఆ కోడిని లేపి, అది క్కొక్కొరోకో ! అని అంటూ అయిదారుసార్లు మ్రోగిన తరువాత పనిచేసే మనిషి, పాలవాడు, వగైరా వగైరా జనం రావటం వాళ్ళ హడావిడికి ఆవులు అంభాః అని అరవటం, చెట్లమీద యింకా కునికిపాట్లు పడుతున్న కాకులకి నిద్రాభంగమై విసుగుతో అవి కాకిగోల చెయ్యడం. ఈ కోలాహలం పృథ్వీమండలాన్ని దాటి భూనభోమండలాలు నిండిపోవడం దాంతో నిన్న సాయంకాలం అనగా యింటికి వెళ్ళిన కిరణ చక్రవర్తి తూర్పు దిశనుంచి యీ లోకం మీదకు నెత్తురు కళ్ళతో చూడటం! కాని యింత రభస జరిగినా ఆ యిల్లాలి మొగుడు మాత్రం చలనం
లేకుండా శయ్యను అంటిపెట్టుకునే వుండటంతో ఆ పిల్లల తల్లికి యీ పెద్ద పిల్లవాడి మేల్కొల్పులు తప్పేవికాదు.

ద్వాపరయుగంలో అయితే ఎంతకూ నిదర చెరగని చిన్న కృష్ణయ్యని, అతనిని కవ్వించి, అతనిచే అల్లరిపడే 'శీలా గోపవధూ మణలు" ఒంటిగానో, జంటగానో

తెలవారవచ్చె తెలియకనా స్వామి
మళ్ళి పరుండేవులేరా,
మళ్ళి పరుండేవు మసలుతూవుండేవూ, మారాము చాలించావేరా!

అప్పుడే విందుకు లేవాలి? అని ఆ కొంటే కోణంగివాడు ఎదురు ప్రశ్న వేస్తాడేమోనని

కల కల మని పక్షి గణములు చెదిరేను
దేవరా నిదుర లేవరా!

అని మొర పెట్టుకునేవాళ్ళు. మెలుకువలో కళ్ళుమూసుకున్న శ్రీ కృష్ణయ్య వీళ్ళ మాటలను పెడచెవిని పెట్టేవాడు. ఆ చిన్నారులు ప్రపంచరీతులు తెలిసినవాళ్ళు కనుక. అప్పటి పరిస్థితి యిప్పటి సరిస్థితి ఒకటేలేండి. అధికారులతో పని వుండి, ఆనాడు యీనాడు కూడా రిక్త హస్తాలతో వెడితే పని జరగదని త్రికాల విదితమైన సత్యమేగా, అందుకని వాళ్ళ సర్వస్వం ఆయనకు అర్పించినా ఆశలు తీరని ఆ జగత్ ప్రభువులకు చంద్రుడికొక నూలుపోగన్నట్టు ముందు రవ్వంత స్తోత్రం అనంతరం

నాన్నా మీయమ్మ పిలిచేను
వెన్న తిందువుగాని రారా!

అంతవరకూ అటూ యిటు దొర్లుతున్న వాడల్లా యీ "వెన్న సంగతి చెవిని పడగానే" అనుకున్న లంచం ముట్టిన అధికారిలాగా, బిగుసుకుపోయి, అంతవరకూ రూల్సు

రెగ్యులేషన్సు అంటూ మాట్లాడిన వాడు కాస్తా చిరునవ్వు చిందిస్తూ "దానికేముందండి" ఒకళ్ళకొకళ్ళం సహాయం చేసుకోకపోతే ఎలాగండి" వగైరా దృష్టితో వాళ్ళ వంక చూసేసరికి, సంతృప్తిగా అటు చూపు సారించేసరికి. ఆ ఎలనాగలు, వయస్సు సొగసుల హొయలు ఒడలు దాచలేకపోతే పడిన యాతనలు వర్ణింపడానికి భాగవత కథాకారుడికే చెల్లింది.

కాని యీనాడు యీ కలియుగ ప్రథమ పాదంలో, కృష్ణా గోదావరుల మధ్యదేశంలో భర్తని మేలుకొలుపటానికి యింత తతంగానికి తీరిక ఎక్కడ? వ్యవధి ఎక్కడ? అందుకని రాత్రి తలలో వాడిన పువ్వులకంటే యింకా ఎక్కువ వాడిన ముఖంలో చిరాకు మనస్సు వెయ్యి మారాకులు వేస్తూంటే, ఆ చిలకల కొలికి,

బారెడు ప్రొద్దు ఎక్కిపోతోంది. కాఫీ చల్లారిపోతోంది. ప్రక్క యింటి నరసమ్మగారి మొగుడు గంటయి నిద్దరలేచి. ఆఫీసుకు వెళ్ళడానికి తయారు అవుతూవుంటే మీరు మాత్రం యింకా యిలాగే వున్నారు.

అని ఆ అలకులవేణి స్వస్తి వచనాలు పలికేసరికి యీ పురుష పుంగవుడు మాత్రం

నిదుర బరువులు నన్ను విడచుటేనాడో!

నీవు నా మ్రోల నిలచుటేనాడో !!

అని అనుకుంటాడే గాని శయ్య మాత్రం వదలడు.

కాని ఆండాళమ్మ చేత నిదుర బరువులు తీరిపించుకునే మొనగాళ్ళకు మొనగాడు. ఈ సీమ యీ పరగణా దాటి ఏనాడో శివ సన్నిధికి తరలిపోయాడు. దీంట్లో ఆండాళమ్మగారి పొరపాటేం లేదు. ఏమన్నా వుంటే ఆవిడ అర్ధాంగుడు, అలవి కాని సంపద వున్నవాడు చేసుకునే అలవాట్లే నరసింహులుగారు కూడా చేసుకున్నారు. ఒంటెద్దుబండి. మెరకవీధి మొదటి సందులోని యీశాన్యదిక్కు పెంకుటింట్లో, నాచున పుట్టిన కమలంలాగా పుట్టీ పుట్టగానే తన దివ్య సుందర విగ్రహంతో, ఆవాడ వాడకలా తల మాణిక్యమై, సరసుల పాలిట కన్నుల పండుగైన ముద్దుల మోహనాంగి "ముద్దుల" అనేది ఇంటిపేరు అనుకునేవారు సుమాండి. లక్షణంగా తరతరాలుగా వస్తున్న దాని ఇంటిపేరు పువ్వులవారుకాని, సరసకు, రసికతకు తనుకు తానే సాటి అనే పేరుగాంచిన మేలు ముద్దుల మోహనాంగి కంట నరసింహులుగారు పడగానే.

మోహనాంగి ఈ పేరు పూర్వతరంలో వాళ్ళకు రవ్వంత క్రొత్తగా కనిపించవచ్చు. వాళ్ళు ఎరుగున్న పరిభాషలో చెప్పాలంటే పువ్వుల పెద్దరత్తాలు రెండోకూతురు "చెలవాయి " అది అందించిన విందులు కుడిచి మైమరచిన తొలిసరసుడు, యీ మదవతి మదిరిల ఆనంద సంధియుగంలో జన్మించిన మహదానంద ఫలితమే చెలబాయి, ముద్దుల మోహనాంగి .(ముద్దులు బాగా పెట్టుకొనడం తెలిసిన, మోహనాంగి, మొహమే అంగములుగా కలది. మోహమైన అంగములుగా కలది. ఇది శ్రీధర వాఖ్య.) గా మారింది.

అట్టి ఈ ముద్దుల మోహనాంగికి, శత్రుజన భయంకరుడు, మిత్రజన ఆశ్రయుడు, ఇష్టసఖీ ప్రియచంద్రుడు, ఆండాల్ హృదయ మనోహరుడు కన్నుల బడినంతనే జరిగిన కథావిధానం బెట్టిదన,

ఆ సుందరాంగిని చూడగానే ఇతగాడు విరహాగ్ని తపించలేక వెర్రి పరుగులు తీయటం మాట ఎల్లావున్నా అతగాడిని చూడగానే మాత్రం ఆ చిన్నది అలవోకగా చిరునవ్వు

చిందించి సోయగాలు వెదజల్లు అరమోడ్పు కనులతో అంజలి ఘటియించి, స్వామి వారిమీద అభినయం సలుపుతున్నట్టుగా, అలనాడు గుడిలో జరిగిన నృత్యంలో ఈ రూపజిత మన్మధుడిని చూడగానే, మనస్సు నిలువక, ఆనందంలో చెక్కిళ్ళు కెంపురాజిలి.

"మక్కువ దీర్చరా మువ్వ గోపాలా" అంటూ ప్రారంభించి ఆనాటి సభను అలంకరించి తనను తొలిరోజులలో అనుగ్రహించిన ముదుసలి జమిందారువారి ఎదుట రవ్వంత నాట్యమాడి. రెండొవ చరణం మొదలు కాగానే "ధిత్తాం ! తధిత్తాం?" అని మద్దెలవాడు, తాళగాడు కూడపలుక్కోగానే, ఆసంకేతం అర్థమైనట్టుగా, ఆ గత యవ్వనుడిని వదిలి చెలబాయి రెండంగల్లో, తాళం తప్పకుండా, యీ వాలుకి వచ్చి,

"మక్కువ దీర్చరా మువ్వ గోపాలా!
ఒక్కసారికే సోలిన నన్ను
మరొకసారి మక్కువ దీర్చరా
మువ్వ గోపాలా"

అంటూ మనవి చేసింది. ఆ మనవి వినగానే మానవుడు ఏం చేశాడు? ఆ క్షణంలో ఋష్యశృంగుడిలాగా, దోవ తెలియని ప్రవరుడి లాగా, అమాయికంగా మొహంపెట్టి ఆ చిన్న దానివంక చూశాడు. ఆ సుద్దులు, ఆ వైనం తెలియని ఆ మోహనాంగి రవ్వంత చొరవ తీసుకుని వారి ఎదుటనే మోకరిల్లి,

"పిలిచిని బిగువటరా!" అంటూ ప్రారంభించేసరికి ఆయన ఎంతైనా వీరమాత్రుడేగా వెయ్యి ఆశలతో యింటికి దారితీశాడు. ఆనాడు నిండు పున్నమి. అయినా ఆండాళమ్మగారి చలవవల్ల ఆ రాత్రి ఏకాదశే అయింది.

రాజుకున్న నిప్పు చల్లారని నరసింహులుగారు, చల్లగాలికని బయట అరుగు దగ్గరకు వచ్చేసరికి, ఎదురుగుండా కనిపించింది ఎవరు? చెలవాయి మేనమామనని చెప్పుకుంటూ ఎప్పుడు వాళ్ళ పంచనే వుండి మేళంలో తాళం వేసే రాఘవులు, ఆ వేళలో అతన్ని అక్కడ చూడగానే నరసింహులుగారు రవ్వంత గతుక్కుమన్న మాట నిజమే కాని, అంతలోనే సంబాళించుకుని దర్జాకు తగ్గకుండా గొంతుక స్థాయి పెరగకుండా

"ఏంరా రాఘవా!" అని అన్నారు. మళ్ళీ యింకొకసారి అన్నట్టుగా పెదవి కదల్చారు.

"చిన్నది ఒక్కసారి తమరిని దయచేయమంది." అని అన్నాడు.

ఉలిక్కిపడి "ఎవతెరా" ? అని చిరాకుగానే అడిగాడు.

"చెలవాయి"

"ఎందుకూ"

పదహారేళ్ళ కన్నె కన్నా తానే ఎక్కువ సిగ్గుపడి రాఘవులు తలవంచి బ్రొటనవేలు నేలరాసి

"మనసోయిందట బాబు" అని అన్నాడు. ఒక్క క్షణం ఆగి "సరేలే వెళ్ళు" అని ఆయన గంభీరంగా పైకి అన్నా లోపల వున్న ఆలోచనలు వేరు.

ఆ సీమకు, ఆ పరగణాకు అందాల శిరోమణి తనకు తానై...
నీమీద మనసాయెరా

ఓరే రాజ నీ దానమరా
నన్ను కన్నార మన్నించారా!

అని మనస్సు విప్పి చెప్పడం కన్నా, తనకు తానై వలచి రావడం కన్న కావలసిందేముంది.

అన్నీ బాగానే వున్నాయి, కాని వున్న యిబ్బంది అలా వక్కటే. సుందరీ జన మనోహరుడైన యీ నరసింహులుగారు యీ నాటి వరకు ఎక్కడా బయట విస్తరి వేసి ఎరగరు. విందు భోజనం యింటి దగ్గరే. ఈ తీరుచూచే ఆండాళమ్మగారు గర్వంగా "వారు నా నోముల పంట" అని మెచ్చుకోవడమే కాదు. ముచ్చటైన మొగవాడు ఆయనకు లోటేమిటి? కో అంటే కొల్లలు, కాని శ్రీరామచంద్రమూర్తిలాంటివారు." అంటూ ఆ వాడలోని అమ్మలక్కలు అందరితోనూ చెప్పుకుని మురిసిపోయేది. ఇది పెళ్ళయిన మొదటిరోజుల్లో మాట కాని, ఆ రోజు కారోజు గడిచేసరికి, యీ ఏకపత్నీ
వ్రతం ఆండాళమ్మగారి ప్రాణినికి పెద్దచేటు తెచ్చిపెట్టింది. మనసులో అపర కృష్ణావతారం అయిన నరసింహులుగారి రసికతకు అష్ట భార్యలు, పదహారు వేల గోపికలు. ఒక్క ఆండాళమ్మగారే కావలసి వచ్చేసరికి యీ నిత్య ఆనందానికి తట్టుకోలేక ఆవిడ విసుగ్గా.

"ఎప్పుడూ యింటి పట్టునే వుంటాడు ఏ మొగవాడమ్మా" అంటూ తనలోతానే చిరాకుపడేది. అక్కడితో వూరుకోలేదు సరికదా ?.కటి రెండు సార్లు సంకేతంగా, నవ్వులాటగా సరసం ఆడుతున్నట్లుగానే "ఈ ఏకపత్ని వ్రతం తను భరించలేనని" ఆయనతో మనస్సులోని మాట మనవి చేసుకుంది.

కాని యీ సంకేతాన్ని గ్రహించలేని ఆ నరసుడు రసికతను పెంచాడు కాని ఆవిడ చూసిన వెలుగుబాటలో నడవలేకపోయాడు.

బహుశః దానికి కారణం కాపురానికి వచ్చి పది సంవత్సరాలు దాటినా ఎన్ని పూజలు, మొకుబ్రడులు చెల్లించినా యీ నాటికి కూడా, ఆ యింట ఉయ్యాల తొట్టె వేసుకునే ఆస్కారం లేకపోవటం. అంతేకాదు. ఏడువారాల సొమ్ములు పెట్టుకుని యీ నాటికి కూడా పదహారేళ్ల పడుచులాగా, లక్ష్మీదేవిలాగా ఆండాలమ్మగారు నట్టింట తిరుగాడటం.

ఇంకా అన్నింటికంటే ముఖ్యం, తన తోటి ముత్తైదువుల్లాగా, భర్త దరిజేరగానే,
నన్ను ముట్టుకోకే నా మాలకాకి!" అన్న పద్ధతిలో గాని
"రాయుడుంగారి పోరుపడలేకకాని నాకే కోరికలే లేవే సుబ్బాయి!" అన్న ధోరణిలో, సంసారం, నిర్లిప్తంగా, నిష్కామంగా, నిర్వికారంగా గడవకుండా, యీ సృష్టి యజ్ఞంలో ఆండాలమ్మగారు కూడా యితోధికంగా సహాయం చెయ్యడం చొరవ జూపించడంతో, ఆయన ఇంతకాలం, ఆహితగ్నుడుగా ఏకపత్నీ వ్రతుడుగా నిష్ట చెరగకుండానే వుంటూవచ్చారు. యుగాలు, మన్వంతరాలు, గడిచి యీ నాటికి వ్రత ఉద్వాసనం ఆసన్నమైంది.

అందుకనే రాఘవులు సిగ్గుపడుతూ ఎదురుగా నిలబడివుంటే, "మనపోయిందట బాబు!" అన్న వాడి వాక్యం ఒకటికి పదిసార్లు మనస్సులో పోరాడుతూ వుంటే ఆయన చేసేదేమిటి? ఇంట్లోకి వెళ్ళి ఉత్తరీయం మీద వేసుకుని, మల్లేపూవులదండ చేతికి కట్టుకుని,

మిఠాయి పొట్లం పుచ్చుకుని ఆ చిన్నదాని యింటికి వడి వడిగా అంగలు వేసుకుంటూ వెళ్ళలేదు. గిరుక్కున వెనక్కి తిరిగి, మండువాలోకి వచ్చి వరండాలో ఏకవస్త్రగా నేలమీద చిరిచాప పరుచుకుని పడుకున్న భార్యను ఉద్దేశించి "ఇదిగో!" అని చిరునవ్వుగా పలికారు. ఆ పలుకులో ఆవిడకు తోచిన అర్థం వేరు. అటునుంచి యిటు వత్తిగిలి అరమోడ్పు కనులతో సైగగా

"చెరగు మానెరా స్వామి!" అని మనవి చేసింది.

"నాకు ఆ మాత్రం తెలియదా అన్నట్టుగా ఆయన ఆవిడ వంకచూచి ఫక్కున పెద్ద పెట్టున నవ్వాడు. ఆ నవ్వు తనని చూసేననుకుని ఆవిడ రవ్వంత కలవర పడ్డది. కాని అంతలోనే చిరుకోపం నటిస్తూ,

"ఎందుకా నవ్వు?" అని అడిగింది.

చెలవాయి కబురు పంపించింది."ఏమని?"

"మనసోయింది రమ్మని"

ఈసారి నవ్వటం ఆవిడ వంతు. నేలమీద పడుకున్న మనిషి లేచి కూర్చుంది. ఫక్కున నవ్వింది. ఈసారి తెల్లబోవటం నరసింహులుగారి వంతు.

"ఏవిటే ఎందుకు నవ్వుతావు." అంటూ ప్రశ్న దూకుడుగానే వచ్చింది. ఆవిడ గల గలమని నవ్వుతూ

"ముసలివాడి మీద చెలబాయికి మనసైందేమిటా! అని నవ్వొచ్చింది"

"నన్ను ముసలి వాడంటున్నావా!" అహం దెబ్బతిన్న కంఠంతో ప్రశ్న వచ్చింది. కోపం కన్న ఆ ప్రశ్నలో బాధ ఎక్కువగా వుంది.

"మీరు ముసలివారని ఎవరన్నారండి అంటూ బుజ్జగించినట్టుగా అని కొంటెగా ఆయన వంక చూస్తూ చిలిపిగా నవ్వుతూ

"మీకూ మనసైతే మీరూ నిక్షేపంలాగా వెళ్ళిరండి" అని అంది.

"ఏమిటే నువ్వంటోంది?

సత్రం భోజనం చేస్తేనేగాని యింటి భోజనం విలువ తెలియదు.

ఇదుగో

మనస్సు తీర్చిరండి గాని మణి మాణిక్యాలు మాత్రం యిచ్చి రావద్దు! అని హెచ్చరిక వచ్చింది.

నరసింహంగారికి యీసారి నిజంగానే కోపం వచ్చింది. "కబురు పంపింది గదా అని పరిగెత్తుకుంటూ వెడతాననుకున్నావా? నా అంతర మెక్కడ దాని అంతరమెక్కడ?' ' అంటూ రుస రుస లాడారు. రెండంగల్లో వెళ్ళి వీధి గడియవేసి వచ్చారు. గడియ శబ్దం వినగానే ఆవిడ మనస్సుకి పట్టిన మబ్బులు అట్టే విచ్చుకున్నాయి, మళ్ళీ వెన్నెల వచ్చింది.

కాని అంతలోనే ఆవిడ మనస్సులో వెయ్యి ఆలోచనలు వచ్చాయి.

కట్టుకున్న మగవాడు తననికాదని నిర్లక్ష్యం చేసి వెళ్ళడం లేదు, పెడత్రోవను పట్టటంలేదు. సాటి ఆడది, పాతివ్రత్యం పట్టింపులతో యిబ్బంది లేనిది. తనకు తానై వలచి వచ్చినదాన్ని యీ విధంగా నిరాదరణచేస్తే, దాని ఉసురు తనకు తగిలితే ?? ఇల్లా

ఎందరి వుసురు తనకు తగిలిందో? అందుకనే యీ యింట్లో యింతకాలం ఒక అచ్చటా ముచ్చటా లేకుండా తాము ఇద్దరూ యిల్లా లింగూ లిటుకూలాగా మిగిలిపోయారు.

ఐనా మొగమహారాజు ఆయనకేం పోయింది. ఇలా ఎందరిని త్రోసి రాజన్నారో? ఎందరి మనస్సు చిన్నబోయిందో? ఇంటికి వచ్చిన అతిథికి భోజనం పెట్టడానికి నిరాకరిస్తే నిరాదరణ చేస్తే ఎంత పాపమో ఇదికూడా అంతేగా !!

ఇహ వుండబట్టలేక ఆవిడ నరసింహులుగారి దగ్గరకు వెళ్ళింది. ఆయన ఆరుబయట మల్లెపందిరికి రవ్వంతదూరంలో మంచం వేసుకుని పండు వెన్నెలవంక చూస్తున్నాడు. ఆదృశ్యం చూడగానే ఆవిడకి కోపం రవ్వంత ఎక్కువగానే వచ్చింది.

"మీన మేషాలు లెక్కపెడుతున్నారా?" అని గద్దించింది.

ఈ మబ్బులేని పిడుగుని చూసి ఆయన వులిక్కిపడ్డారు.

అంతలోనే తెప్పరిల్లుకొని "దేనికి?" అని అడిగాడు.

వెళ్ళకుండా యింకా యిలాగే వున్నారా? అది అక్కడ ఏం అఘోరిస్తోందో.

వెన్నెల చూసేసరికి నీ కూ్కడా మతిపోయిందా?

వెళ్ళకపోతే నన్ను చంపుకు తిన్నంత వట్టు!

ఈ మాట వినగానే ఒక్కసారి ఆయన కొరడాదెబ్బ తిన్నవాడిలాగా ఎగిరిపడి ఆశ్చర్యంగా భార్యవంక చూస్తూ నిలబడిపోయాడు.

ఏం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?

"గృహస్థు అన్నవాడు అతిధిని అభ్యాగతుడిని ఆదరించాలిగాని పస్తుంచకూడదు.' నరసింహులుగారు యీసారి చిరునవ్వు నవ్వారు.

"దానికి పస్తుండవలసిన కర్మ ఏమిటి?"

"ఎంతైనా మాత్రం - క్రొత్త కుండలో నీరు తియ్యన, కోరిన మగవాడు తియ్యన."

అని ఆవిడ అనగానే విచారంగా భార్యవంక చూసి,

లాభంలేదు. రేపు ఆచార్యులగారికి చూపించి నీకు యింత వీభూతి పెట్టించాలి. నీ ధోరణి చూస్తే గాలో ధూళో సోకినట్టు అనిపిస్తోంది."

కోపం రావటం యీసారి ఆవిడ వంతు. గణాచారి లక్షణాలు అప్పుడే కనబడుతున్నాయి.

"నాకు దయ్యమే పట్టింది. మీరు వెళ్ళకపోతే నామీద ఒట్టు !

నరసింహులుగారు చాలా యిరకాటంలో పడ్డాడు. తన సమస్యకి యిది పరిష్కారం కాదని తెలుసు కాని పరిష్కారం ఏమిటో తెలియటం లేదు.

ఏ కామినీ పిశాచమో చెలవాయిని పట్టుకుని వుంటుంది. దీని తాలుకు గాలేదో దీనికి కూడా సోకి వుంటుంది. లేకపోతే ఎక్కడైనా మొగుడిని తనంతట తాను వత్తిడిచేసి భోగంవారి యింటికి పంపించే యిల్లాలు వుంటుందా.

మహా పతివ్రత సుమతి అలనాడు మొగుడిని బుట్టలో పెట్టుకుని భోగందాని

యింటికి మోసుకుని వెళ్ళిందంటే, మహా పతివ్రత అని అంతా వెయ్యి కంఠాల పొగిడారు. కాని అందులోని చిదంబర రహస్యం ఆడవాళ్ళకే అర్థం అవుతుంది. అసలే కుష్టు వ్యాధివాడు. సంసారానికి ఎలాగో పనికిరాడు. అచ్చటా-ముచ్చటా తీర్చటం చేతకానివాడు. ఇంటి పట్టునవుండి తనని వేధింపకుండా ఆవిడ ఆయన అడగటమే తరువాయి ఆయన్ను మోసుకొని భోగందాని యింటికి తీసుకుని వెళ్ళిపోయింది.

అది ఏనాడో పురాణకాలం నాటి కథో, కట్టుకథో కాని యీ కలియుగంలో యిటువంటి విడ్డూరం ఎక్కడా చూడలేదే!

ఏమీ అనలేక ఎవ్వరికి చెప్పలేక నరసింహులుగారి చెలవాయి యింటికి దారి తీశారు.

ఇంతకాలం అందరిచేత ఔననిపించుకుని ఘనంగా బ్రతికిన మొగరాయుడికి యీ పని కానిపనిలాగా కనిపించింది.

చెలవాయి యింటికి పాదమైతే సాగ్గింది కాని, ఆ నడకలో చురుకుదనం లేదు. ఆ చూపులో ఉల్లాసం లేదు.

అదే కనుక యింకొక సరసుడైతేనా యీ పాటికి మల్లాది రామకృష్ణయ్యగారు చెప్పినట్టుగా

"చిన్నది చేమంతి రేకుల వన్నెది
మొన్ననే అటు మొన్ననే రమ్మన్నది
మోజై రమ్మన్నదిరా అన్న !
సిరి సిరి మువ్వా ! గువ్వల చెన్న !
గున్న మావి తిన్నె మీద
వెన్నెల మసలే వేళలో
మొన్ననే అటు మొన్ననే రమ్మన్నది
మొజై రమ్మన్నదిరా అన్న !

అంటూ గంతులు వేసుకుంటూ వెళ్ళకపోనా ! కాని యీయన తీరు ఆ తీరునలేదు !

కట కటా ఏంతటి దుస్థితి వాటిల్లినది !
ధనమా పోవున్, మానమా చెడున్
లో నిందింతురు బంధువుల్? !

అంటూ ఆ మానవుడు అంతరాళాల్లోంచి కృంగిపోతూ ఆ చిన్నదాని యింటి చాయలకు చేరాడు. అలవాటులేని ప్రాణికావటంవల్ల ఎల్లా గృహప్రవేశం చెయ్యాలో తెలియక తికమక పడుతూవుంటే,

వెన్నెలవేళలో తపావాడకు విచ్చేసిన యీ బుష్యశృంగుడిని చూడగానే లెక్కకు మించినన్ని యిళ్ళల్లోంచి, కిల కిల నవ్వులు, గల గల గాజుల చప్పుళ్ళు వినిపించడమేకాదు. పరువంపు పరిహాసాలు ప్రకృతిలో రవళించాయి. నిన్నగాక మొన్ననే వృత్తిలోదిగి, కాలంతోబాటు యింకా రాటు దేరక, మనసున మమతలు మరిచిపోలేని వయ్యారి

ఒకతె యీ రూపజిత, మన్మధుడిని చూడగానే మనస్సు మైమరచి, వీరికి మాత్రం వినిపించేలాగా

మనసైన దానరా.
మగధీరా ఏలరా !
మనసుపడని ఏ రమణినైన
కొనగోట తాకవని విన్నానురా !

అని ఆలపించేసరికి ఆయన అమ్మయ్య ! మనమంటే మంచి ఉద్దేశ్యమే వుందిలే అని తనలోతాను మురిసిపోతున్న క్షణంలో ఆశనిపాతంలాగా యింకొక చరణం విన వచ్చింది.

మనసైన బాల
నునులేత పరువాల
పండించక మానవని
నమ్మివున్నానురా !

ఈ చరణం వినగానే అయిష్టంగానే ఆయన చూపు ఆ దిక్కే వెళ్ళి అక్కడ నిబడిన నల్లచలువరాతి విగ్రహంలాంటి వ్యక్తిమీద నిలచింది.

ఎవరీ అందానికి అందం అని ప్రశ్నించుకుని సమాధానం కోసం నిరీక్షించే అరక్షణంలో సప్తస్వరాలు ఒక్కసారే మేళవించిన ఒక తీగెలు లేని ముసలి వీణ "అల్లుడుగారూ !" అంటూ ఆప్యాయంగా పలుకరించింది. ఆ పిలుపుకు కను విప్పి తన స్థితి, తన ఉనికి గుర్తుకువచ్చి అటు కలయజూచేసరికి ఆ రాగమయి కనుచాటయింది. రావణాసురుడి చెల్లెలుమాత్రం ఎదురుగా కనిపించింది.

ఇంకొక్క క్షణం జరిగితే ఏం జరిగేదో ఏమో ఆడపిల్లకన్నా ఎక్కు సిగ్గుపడుతూ, దూతికకన్న నేర్పుగా, ఇష్టసఖికన్నా చనువుగా, హోయలు చూపుతున్న మొగ కంఠం.

"ఇటుదయచేయండి బాబు అంటూ పలికేసరికి ఆయన ఆ కంఠం అంతలోనే గుర్తుపట్టి, పేదకు దొరికిన పెన్నిధిలాగా, వరం యివ్వడానికి వచ్చిన వేల్పుల దొరని చూచినంతగా సంతోషించి,

"రాఘవా" అని అన్నారు.

"దయచేయండి బాబు. తమకోసం చిన్నది అల్లాడిపోతోంది" అంటూ మనవిగా హెచ్చరిక చేశాడు. ఆయన పరాకుమాని అతగాడివెంట నడిచాడు.

ఇక్కడ ఈ తంతు యిల్లా జరుగుతూ వుండగా అక్కడ ముద్దుల మోహనాంగి విరహం వర్ణించాలంటే కూచిమంచి జగ్గకవి అవుసరం లేదుకాని ముద్దు పళని అవుసరం ఎంతైనా వుంది.

చెలవాయి పోకడ, తీరు, రత్తాలు కేం నచ్చలేదు. బొత్తిగా అర్థం కాలేదు.

"మనకుగా మనం కబురు పంపడం ఏనాడైనా వుందా? ఈ ప్రేమలు, యీ మోహాలు సంసారులకు కాని మనకు కాదే !!

వయస్సులో వున్నప్పుడే నాలుగు డబ్బులు వెనకవేసుకోవాలి. వయస్సు జారిపోయే తరుణం వచ్చేసరికి పెద్దవారి ఎవరినైనా ప్రాపకం సంపాదించుకుని వారి నీడలో

వుండిపోవాలి అంతేకాని యీ ప్రేమలు మనకు కూడు పెడతాయా ? గుడ్డ పెడతాయా?'
' అని మందలించింది.

"ఆయనకేం అమ్మ ! వారూ కోటీశ్వరులేగా ! సుక్షేత్రం లాంటి మాగాణి వంద ఎకరాలకుపైగా వుందట. ధనధాన్యాలకు లోటు లేదట" అని చెలవాయి నచ్చచెప్ప పోయింది.

అవన్నీ మన యింట్లోకి వచ్చిపడతాయటే పిచ్చితల్లీ ! వాళ్ళకు మోజు కలిగితేనే మొగవాడు సర్వస్వం యిచ్చేది. కాని ఆడది నోరు తెరచి అడిగిందా ! అష్టఐశ్వర్యాల మాట ఎలావున్నా ఆకూ వక్కకుకూడా ఆస్కారం వుండదు."

"ఆయన అందరిలాంటివారు కారమ్మా" అంటూ చెలవాయి ఒక వాక్యం విసిరింది.

దానికి సమాధానం ఏమి వచ్చేదో మనకు తెలియదుకాని రాఘువులు పొడిదగ్గు వినిపించింది. ఇంట్లోకి అడుగుపెట్టడానికి సందేహిస్తున్న నరసింహులుగారు కనిపించారు.

ఆ సిగ్గుల బాలా కుమారుడిని చూడగానే చెలవాయిలో కవిత్వం పుట్టుకువచ్చింది. సముద్రాల వారు మనస్సులో మసిలారు.

మంచిదినము నేడే
మహారాజుగా రమ్మనవే !
సుదతిరో అలవాని సామ్మే
కాదటే యీ మేను ...

అంటూ నృత్యంలో రవ్వంత అభినయించి అంతలో సిగ్గులు ముంచుకురాగా. క్రీగంట చూస్తు, "ఆ భీత హరిణేక్షణి" ఇంతలుగా వున్న కన్నులు అరమోడ్పులు అంజలి ఘటియించి, భామాకలాపంలోని భామలా జడమాత్రం తెరమీద వదలి, తను మాత్రం గాజు పూసల తోరణాల తెరవెనుక శయ్యాగృహంలో అలవోకగా నిలబడింది.

నిత్య కళ్యాణుల యింటరీతి రివాజుల తెలియని ఆ అజ్ఞాని అలా నిలబడే వున్నాడు.

"లోపలకు దయచేయండి బాబు" అంటూ రత్తాలు మనవిచేసింది. కాని ఆ మనవిలో ఎంత వద్దనుకున్నా రవ్వంత కర్కశత్వం కనిపిస్తూనే వుంది.

చిన్నది మోజై రమ్మన్నదిగదా ! నిదురకు రమ్మని సిగ్గు విడిచి చెప్పింది కదా, చేతులు జాడించుకుంటూ వచ్చాడు. ఈయనేం మొగరాయుడమ్మా?

ఆడదాని మనస్సు అర్థం చేసుకోలేని మగవాడికి, మగసిరి ఎంత వుంటే ఏం లాభం ???

సరసం తెలిసిన రసికుడేం చేసేవాడు? రమణి ముద్దుల గుమ్మ రమ్మని పిలువగానే, కబురు తెచ్చిన కాంతకు కనకం రవ్వంత ముట్టచెప్పడం, ఆ పైన అందరికి సరిపోయే నేతి మిఠాయి, ఇల్లంతా నిండిపోయే పూల చెండ్లతో రావాలి. సరసను చేరిన సన్ను తాంగిని లాలించి కవ్వించి ఎదలో వ్యధలన్నీ తీర్చాలి. అంతేగాని,

ఎంత దివ్య సుందర విగ్రహం అయితే మాత్రం యిలా మాటా పలుకూ లేకుండా మ్రానులా నిలబడితే, ముచ్చట ఎలా తీరుతుంది? మురిపెం ఎలా తీరుతుంది? ఇటువంటి బుద్ధావతారాలు వుంటాయని గ్రహించే ఆ రోజుల్లో గురుకుల ఆశ్రమంలో విద్య పూర్తి

కాగానే డిగ్రీ యిచ్చే ముందు శృంగార శాస్త్రంకూడా నేర్పేవారట ! ఆ రోజులే వేరు. ఆ కథలే వేరు !!

"లోపలికి దయచేయండి!" అంటూ మళ్ళీ హెచ్చరిక వచ్చింది.

నరసింహులుగారు ఒక్కంగలో మోహనాంగి గదిలోకి వెళ్ళారు.

వీరి రాకకోసమే ఎదురు చూసిన చిన్నది, ఆ గదిని భూతలస్వర్గంగా అలంకరించినమాట వాస్తవమే. కాని, యీ అందచందాలు యీ ప్రవరుడి కంటికేం ఆనలేదు.

ఆండాళమ్మగారి అపురూప సౌందర్యానికి అలవాటుపడిన ఆ మగరాయుడికి యీ రంగుల బొమ్మని చూడగానే మనస్సులో మసలిన మాట.

"సత్రపు భోజనం !"

ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ అందెల రవళి వినిపించేసరికి కన్నెత్తి ఆ సుకుమారి వంక చూశాడు.

అలవాటు కాని సిగ్గుతో సతమతమవుతున్న ఆ కుటిల కుంతల, మీగడలు తేలుతున్న వెచ్చటి చిక్కటి పాలగ్లాసు ఆయనకు అందించింది.

ఆయన అలవాటుగా పాలగ్లాసు అందుకుంటూ, మోహనాంగివంక చూశారు. ఆ చూపులో చిలిపితనం వుంది.

"నీ పద్ధతి అంతా విడ్డూరంగా ఉంది" అని అన్నారు. ఉలిక్కిపడినట్టు నటిస్తూ ఏమిటది? ఏమా విడ్డూరం?" అన్నట్టు ఆయనవంక చూసింది.

"నువ్వు సిగ్గుపడుతూ కూర్చోవాలి. నేనే పాలగ్లాసు నీ కివ్వాలి" అని ఆయన అన్నారు.

చెలవాయి ఫక్కున నవ్వింది.

ఎందుకా నవ్వు? ఏమా కథ! అని అయన అడగక పూర్వమే,

"అవన్నీ ఐనింటి ఆడవాళ్ళకు." అని చెలవాయి అనగానే, నరసింహులుగారు ఒక్క క్షణం ఆ మనిషివంక నిదానంగానే చూశారు.

"ఒక్కమాట జాగ్రత్తగా విను. నువ్వు రమ్మని కబురు పంపగానే మోజుకొద్దీ పరుగెత్తుకుని వచ్చాననుకుంటున్నావేమో !! మా యింటి ఆడది పోరగా వచ్చాను. నిన్ను వుసురు పెట్టవద్దని అది ఒకటికి పదిసార్లు చెప్పగా వచ్చాను. నేను వచ్చిందికూడా నీతో సరస సల్లాపాలు ఆడటానికి నాదు. నాలాగా నిక్షేపంగా కాపురం చేసుకుంటున్న వాళ్ళను చెడగొట్టవద్దని గట్టిగా చెప్పడానికి.

ఈ మాటలు వినగానే మోహనాంగి ముఖం ఇంద్రధనస్సులాగా కనిపించింది.

మీ సంసారం చెడగొట్టటానికి నేనేం పూనుకోలేదే? మీరు లక్షణంగా సంసారం చేసుకోవాలనే నా కోరిక" అని గద్గదకంఠంతో మనవి చేసింది.

ఇప్పుడు యిలాగే అంటారు. తరువాత సర్వనాశనం అయ్యేది మేమే, విప్రనారాయణ కథ నీకు తెలియదూ?

తెలియదన్నట్లుగా చెలవాయి తల అడ్డంగా వూపింది?

మనుచరిత్ర చదివావా?

ఆ పేరే విననట్టు అతనివంక చూసింది,

చింతామణి!

భక్త చింతామణి నాటకం చూశాను.

"చూశావుగా! దాంట్లో ఏముంది? విటులంతా నరకానికి వెళ్ళారు. వేశ్య కాస్తా భక్తురాలై కూర్చుంది."

చెలవాయి బాధగా, యితని వంక చూచింది.

"మంచో చెడో నిన్ను దగ్గరకు తీసుకున్నవారిని నమ్ముకుని వుండు. ముక్తి, రక్తి కూడా దాంట్లోనే వుంది."

ఈ మాటలు విన్న చెలవాయి మొహంలో, కచుడిచే నిరాకరించబడిన దేవయాని కనిపించింది. దానికే దివ్యశక్తులు వుంటే నరసింహులుగారి హంస అప్పుడే లేచి పోయేది... కాని ఆండాళమ్మగారి మంగళసూత్రం మహాగట్టిది.

కోపం బుసలుకొట్టింది. కాని అంతలోనే దైన్యం ముంచుకువచ్చింది.

"ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" అన్నట్టు జాలిగా చూసింది.

నరసింహులుగారికి కూడా ఆ చూపు అర్థమైంది. కంఠంలో కర్కశత్వం రవ్వంత తగ్గి తగు మాత్రం మార్దవం వచ్చింది.

నీ మీద నాకేమి కోపంలేదే చెలవాయి. నువ్వు మనసు పడి రమ్మని కబురుచేస్తే యిలా మాట్టాడుతున్నానని అనుకోకు. సంసారమన్న తరువాత దాంటోవున్న సాధక బాధకాలు నీకు తెలియనివి కావు. ఒకళ్ళకు రొట్టె ఒకళ్ళకు ముక్క ఎక్కడన్నా వీలుందా చెప్పు ? ?

అందమైన వాడినని మనసోయిందని నువ్వు కబురు పెట్టావే అల్లాగే ఆండాళ్ళు అందంచూసి ఎవరైనా కబురులు చేస్తే మనం హర్షించగలమా? సంసారంలో శీలమనేది ఒక్క స్త్రీలకే కాదె పురుషులకి కూడా వుండాలి... అని నా పద్ధతి.

ఇహ నీ విషయ మంటావా? నువ్వు కావాలని వెతుక్కుంటూ వచ్చినవారిని మనసారా ఆదరించి లాలించు. అందులోనే వుంది నీకు రక్తి, ముక్తి,"

చెలవాయి చెబుదామనుకున్న మాట మనస్సులోనే ఆగిపోయింది.

కన్నులదాగిన కన్నీరు కళ్ళపడకుండా తలవాల్చింది, మనస్సును రాపాడిన కోరికలు నేలరాస్తున్నట్టుగా బ్రొటనవేలు నేలరాసింది. పమిట కొంగు చివర, చేతివ్రేలికి చుట్టుకుంది, తల ఎత్తకుండానే.

"పాలు" అని అన్నది.

నరసింహులుగారు చిరునవ్వు నవ్వారు. చుక్క మిగల్చకుండా వెచ్చటి చిక్కటి మీగడ పాలు త్రాగేశారు. ఉత్తరీయం దులుపుకుని భుజంమీద వేసుకుని వడివడిగా అంగలు వేసుకుంటూ ఆయన వెచ్చని వెన్నెలలో కలసిపోయారు.